# 2

# క్రీస్తునందు నూతన జనులు

"కాగా ఎవడైనను క్రీస్తునందున్నయెడల వాడు నూతన సృష్టి; పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను" (2 కొరింథీ. 5:17).

క్రొత్తదనంతో ప్రతి ఒక్కడు ఆనందిస్తాడు. అది క్రొత్త శిశువేగాని, క్రొత్త కారేగాని, క్రొత్త యిల్లేగాని, లేక కేవలం క్రొత్త సాక్సేగాని, క్రొత్తవాటి యొక్క క్రొత్తదనం, చేతనత్వం ఎల్లప్పుడు మనలను పులకరింపజేస్తుంది.

గ్రీకు భాషలో రెండు పదాలున్నాయి "క్రొత్త" అనే ఒకే పదంతో (new) ఆంగ్లంలోనికి తర్జుమా చేయబడ్డాయి. ఆ పదాల్లో ఒకటి *neos*, అంటే "కాలంలో క్రొత్తది." ఈ పదాన్ని ఉపయోగించి, క్రొత్తగా జన్మించిన శిశువును గూర్చి, "ఇతడు ఒక క్రొత్త మానవుడు" అని చెప్పవచ్చు. క్రొత్తగా నిర్మించి యింతవరకు యింకా నివాసం ప్రారంభించని యింటిని గూర్చి "ఇది క్రొత్త యిల్లు" అని అనవచ్చు. అటు శిశువు, యిటు యిల్లు రెండును కాలంలో క్రొత్తవే. అవి ఎక్కువ కాలంగా ఉనికిలో లేవు.

మరొక గ్రీకు పదం, *Kainos*, ప్రాథమికంగా "రకంలో క్రొత్తదనం" అని అర్థం. దీనితో పాత యిల్లు క్రొత్తగా తీర్చిదిద్దబడిన దానిగూర్చి, "ఇది క్రొత్త యిల్లు" అనవచ్చు. ఒక పాత కారుకు క్రొత్త మోటారు, క్రొత్త టైర్లు యిచ్చి, దాన్ని పెయింట్ చేస్తే, దాన్ని గూర్చి, "ఇది క్రొత్త కారు" అని అనవచ్చు. కారుగాని, యిల్లుగాని "కాలంలో నూతనమైనవి" కావు, కాని అవి "శ్రేణిలో క్రొత్తవి." వాటికి క్రొత్తదనం అనుగ్రహించబడింది. అవి తిరిగి నిర్మాణం చేయబడ్డాయి.

పౌలు 2 కొరింథీ. 5:17లో ఉపయోగించింది ఈ రెండవ పదం *Kainos*, వాస్తవంగా, ఈ వాక్యాన్ని, "కాబట్టి ఎవడైనను క్రీస్తునందున్నయెడల, వాడు స్వభావంలో – నూతనమైన వ్యక్తి; పాతవి గతించెను; ఇదిగో స్వభావంలో – క్రొత్తవైనవి వచ్చాయి." అని తర్జుమా చేయవచ్చు. మనం తిరిగి కాలంలో సంపూర్ణంగా మరల ప్రారంభిస్తామని చెప్ప లేదు, కాని స్వభావంలో మనం నూతనంగా ఆరంభించ వచ్చునని అతడు బయలుపరుస్తున్నాడు. గతించిపోయిన కాలాన్ని రికవరీ చేసికోవాలనే మన కోర్కెకు ఎలీజబెత్ ఏకర్స్ ఏలెన్‌వలె అతడు స్వరాన్ని యివ్వలేదు:

వెనుకకు, తిరుగు వెనుకకు,
ఓ కాలమా, నీ గమనంలో,
కేవలం ఈ రాత్రికి నన్ను మరల
పసిబిడ్డగా చేయుము!

దీనికి బదులు, పౌలు చెప్పుతున్నదేమంటే, "నీ జీవితం ఏమైయుండినా, అది క్రొత్తదిగా చేయబడవచ్చు నీవు ఓడిపోయినవాడవైతే, నీవు విజేతవు కావచ్చు. నీవు ఆత్మసంబంధంగా చనిపోతే, నీవు తిరిగి బ్రతికింపబడవచ్చు."

క్రీస్తు ద్వారా నూతనంగా చేయబడిన జనుల సముదాయమే సంఘం. వారు పాపములో చచ్చిన జనులే, సువార్తవలన తిరిగి జీవింపజేయబడ్డారు. కొలస్సీలో ఉన్న సంఘానికి పౌలు యిలా తెలిపాడు, "మరియు అపరాధములవలనను, శరీరమందు సున్నతిపొందక యుండుటవలనను, మీరు మృతులై యుండగా ... ఆయనతో కూడా మిమ్మును జీవింపజేసెను" (కొలస్సీ. 2:13). క్రైస్తవులు, క్రీస్తునందు నూతన జీవము అనుగ్రహింపబడినవారైనా, ఈ నూతన జీవితము పాపముచే దొంగిలింపబడకుండేలా వారు ఈ నూతన జీవం విషయంలో శ్రద్ధ కలిగియుండాలి. పౌలు ఎఫెసీయులను యిలా హెచ్చరించాడు, "కావున మునుపటి ప్రవర్తన విషయములోనైతే, మోసకరమైన దురాశలవలన చెడిపోవు మీ ప్రాచీన స్వభావమును వదలుకొని మీ చిత్తవృత్తియందు నూతనపరచబడినవారై, నీతియు యథార్థమైన భక్తియుగలవారై, దేవుని పోలికగా సృష్టింపబడిన నవీన స్వభావమును ధరించుకొనవలెను" (ఎఫెసీ. 4:22-24).

దేవుడనుగ్రహించే ఈ నూతన - స్వభావపు జీవితాన్ని గూర్చి ఒక సమయానుకూల ప్రశ్న ఏమంటే, "దేవుడు దీనిని ఎలా ప్రసాదిస్తాడు?" లేక దాన్ని మరో విధంగా అడగాలంటే, "క్రీస్తులో మనలను నూతన సృష్టిగా చేయడానికి దేవుడు ఏ పద్ధతిని వినియోగిస్తాడు?" ఈ ప్రశ్నకు పౌలు రోమా 6లో జవాబిస్తాడు.

రోమా 1-3లో, జనులు ఎలా రక్షింపబడతారో లేక దేవుని యెదుట విధేయతతో కూడిన విశ్వాసంవలన ఎలా నీతిమంతులుగా తీర్చబడతారో పౌలు విశదపర్చాడు. రోమా 4లో, విశ్వాసంయొక్క ఉదాహరణనిస్తూ, అబ్రాహామను మనుష్యుడు దేవుని యెదుట ఎలా నీతిమంతుడుగా తీర్చబడ్డాడో సూచించాడు. అప్పుడు, రోమా 5-8ల్లో, రక్షణనుండి సమకూడే ఆశీర్వాదములను పౌలు లెక్కించాడు: దేవునితో మనకు సమధానం కలిగింది (5); మనం క్షమించబడ్డాం (6); మనం విధేయతతో కూడిన విశ్వాసం క్రింద ఉన్నాం, మోషే శాస్త్రం క్రింద లేము (7); మనకు జీవముంది (8).

రోమా 6లో, క్రీస్తు ద్వారా పాపమునుండి మనకు కలిగిన విడుదలను గూర్చి పౌలు వివరిస్తుండగా, దేవుడు మనలను ఎలా నూతనమైన జనులుగా చేశాడో అతడు వివరించాడు. రోమా 6కు నాతో కూడా రండి, క్రీస్తునందు దేవుడు మనలను ఎలా నూతనమైన వ్యక్తులుగా చేస్తాడో చూద్దాం. పౌలు వివరించిన విధానం రెండు అంచెలుగా విభాగింపవచ్చు. సీతాకోక చిలుక ఎదుగుదలతో, విజ్ఞాన శాస్త్రవేత్తలు మూడు వ్యత్యాసమైన దశలను విడదీశారు: గ్రుడ్డు దశ, లార్వ దశ; మరియు ప్యూపా దశ. అలాగే, మనం క్రీస్తుద్వారా నూతన ప్రజలుగా రూపొందడానికి మూడు దశలను గుర్తింపవచ్చు. మూడింటిలో ఏ ఒక్క దశయైన లోపింపబడినట్టయితే, ఆ విధానాన్ని గర్భ విచ్ఛిన్నం గావించినవారమౌతాం. క్రీస్తునందు నీవు నూతనమైన వ్యక్తివై యుండవచ్చు, కాని నీవు సంపూర్ణంగా నూతనం కావాలనుకుంటే మాత్రం తిరిగి సృజించే దేవుని విధానానికి నిన్ను నీవు లోపరచుకోవాలి.

## మొదటి దశ: వేరుచేయడం

నూతన జీవపు ప్రయాణంలో మొదటి దశ – వేరుచేయబడే దశ. దేవుని పునఃనిర్మాణ విధానానికి పాపంనుండి వేరవ్వడం అవసరం.

పౌలు యిలా వ్రాశాడు, "అలాగైన ఏమందుము? కృప విస్తరింపవలెనని పాపమందు నిలిచియుందుమా? అట్లనరాదు. పాపము విషయమై చనిపోయిన మనము ఇక మీదట ఏలాగు దానిలో జీవించుదుము?" (రోమా 6:1, 2). "పాపము విషయమై చనిపోయిన" అనే మాటలను జాగ్రత్తగా గమనించు. రోమా 5 అనే గత అధ్యాయంలో, పౌలు దేవుని కృపను నొక్కి చెప్పాడు. "పాపం ఎంతగా విస్తరించిందో కృప అంతగా విస్తరించింది" (20, 21 వచనాలు). మన పాపపు సమస్యను దేవుడు తన కృపవలన జయించి, ఈ మార్గంలో ఆయన నిజంగా ఎంత గొప్పవాడో సూచించాడు. ఈ సత్యాన్ని అపార్థం చేసికొనడం ఒకనికి సులభమే. ఉదాహరణకు, "కృప విస్తరించాలని మనం పాపంలో నిలిచియుండాలని ఒకడు చెప్పవచ్చు. మనకు ఎక్కువైన పాపపు సమస్య ఉన్నట్టయితే, దేవుడు మనలను రక్షించడానికిగాను అత్యధికమైన కృపను చూపవలసి యుంటాడు. అత్యధికమైన ఆ కృపనుబట్టి తాను మరి యింకా ఎంతో గొప్పవాడని ఆయన కనుపరచుకుంటాడని ఒకడు అంటాడు." ఈలాటి అపార్థాన్ని పౌలు ముందుగానే పసిగట్టి, రోమా 6 ఆరంభంలో అతడొక ప్రశ్నను లేవనెత్తాడు: "కృప విస్తరించాలని మనం పాపంలో నిలిచియుండాలా?" ఆ ప్రశ్నకు అతడు, "అలా అననే కూడదని!" బల్లగుద్దాడు. "పాపము విషయమై చనిపోయిన మనము ఇకమీదట ఏలాగు దానిలో జీవించుదుము?" అని యింకను ప్రశ్నించాడు. దీన్ని మరో విధంగా చెప్పాలంటే, "క్రైస్తవుడు పాపములో జీవించడం తగని పని, ఎందుకంటే అతడు దాని విషయంలో చనిపోయాడు."

క్రీస్తులోనికి మనం బాప్తిస్మం పొందేవరకు పాపము విషయమైన మన చావు నిర్ణయం కాలేదని పౌలు అంటాడు. రోమా 6:4లో పాపము విషయంలో ఆత్మ సంబంధమైన మన చావుకు మనం బాప్తిస్మం పొందామని అతడన్నాడు. ఏదియెలాగున్నా, పాపము విషయమై మన చావు అనే ఈ బాప్తిస్మానికి ముందు, విశ్వాసము, మారుమనస్సు, ప్రభువును ఒప్పుకొనడంవలన మనం పాపమునుండి వేరు చేయబడాలి. ఈ లేఖన భాగంలో పాపంనుండి వేరు కావాలనే దానిలోనికి పౌలు ఊరకే పోలేదు; పాపం విషయంలో మన చావును సూచిస్తూ అతడు దానిని గుప్తం చేశాడు. దేవునియందును, క్రీస్తునందును విశ్వాసముంచడం (అపొ. 15:9), మారుమనస్సు (1 థెస్స. 1:9), క్రీస్తుగాను ప్రభువుగాను యేసును ఒప్పుకొనడం (రోమా 10:10) అనేవాటితో పాపంనుండి వేరవ్వడంతో పాపం విషయమై మరణించడం గుప్తం చేయబడింది.

ఒకడు క్రైస్తవుడుగా మారేటప్పుడు మూడు ప్రాముఖ్యమైన మార్పులు జరుగుతాయని ముందున్న సువార్తికులలో కొందరన్నారు. మొదటి మార్పు, **హృదయపు మార్పు**, హృదయం పవిత్రపరచబడడం. ఈ మార్పు క్రీస్తునందలి ఒకని విశ్వాసంవలన వస్తుంది. అన్యజను

లను గూర్చి పేతురు యిలా అన్నాడు, "వారి హృదయములను విశ్వాసమువలన పవిత్ర పరచి మనకును వారికిని ఏ భేదమైనను కనుపరచలేదు" (అపొ. 15:9). రెండవ మార్పు **జీవితంలో మార్పు**, పాపాన్ని అలవరచుకునే జీవితంనుండి కడగబడడం. మారుమనస్సు అనేది జీవితాన్ని దిద్దుకునే దాన్ని ప్రతిఫలంగా పొందే చిత్తం యొక్క మార్పు (అపొ. 11:18). మూడవ మార్పు, **కీర్తిలో మార్పు**, ఒకని విశ్వాసం మరియు ప్రభువు భక్తిలో మార్పు. యేసును దేవుని కుమారుడుగాను ప్రభువుగాను ఒప్పుకొనడంతో ఈ మార్పు అమల్లోనికి వస్తుంది (రోమా 10:10). నాల్గవ మార్పు, **స్థితిలో మార్పు** ఒకడు క్రీస్తులో ఉంచబడతాడు. ఈ మార్పు బాప్తిస్మంలో జరుగుతుంది (రోమా 6:3). నాల్గింటిలో మొదటి మూడు "పాపము విషయమై చనిపోయిన" అనే పౌలు యొక్క పద ప్రయోగంలో గుప్తం చేయబడింది, నాల్గవ మార్పు ప్రత్యేకించి రోమా 6:4లో ప్రస్తావించబడింది. పౌలు ప్రకారం, పాపం విషయంలో సంపూర్ణమైన మరణం ఈ నాల్గు మార్పులు అనుభవించేవరకు సంభవించలేదు.

---

పౌలు ప్రకారం, మనము క్రీస్తులోనికి
బాప్తిస్మం పొందేవరకు పాపము
విషయమై మన చావు తుది నిర్ణయం కాలేదు.

---

తండ్రియొక్కయు, కుమారునియొక్కయు, పరిశుద్ధాత్మయొక్కయు నామంలోనికి ముంచడం పొందియు, ఆ బాప్తిస్మం వెనువెంట క్రీస్తునందు నూతన జీవితాన్ని ప్రదర్శింపని జనులని మనలో అందరికి తెలుసు. క్రీస్తులోనికి బాప్తిస్మం పొందిన తరువాత కూడా, ఏ మార్పు లేకుండ వారి గత పాపపు జీవితంలోనే వారు కొనసాగించారు. వారి జీవితాలవైపు మనం తేరి చూచినప్పుడు, వారు నూతన జీవితంలో ఎందుకు ప్రవేశించలేదో మనం ఆశ్చర్యపడుతూ ఉండవచ్చు. రోమా 6లో ఈ ప్రశ్నకు పౌలు కనీసం ఒక జవాబు యిస్తున్నాడు. అతడిలా అడుగుతాడు, "వారు పాపంనుండి తమ్మును తాము వేరు చేసి కొన్నారా? దేవుని పునఃనిర్మాణ విధానానికి పూర్ణంగా తమ్మును తాము లోబరచు కున్నారా?" ఏ కారణాన్ని బట్టియైనా ఈ వేరుపరచబడే దశ తప్పిపోయినట్లయితే, ఒకడు క్రీస్తులోనున్న నూతన జీవంలోనికి ప్రవేశింపలేదు.

క్రీస్తునందలి యథార్థమైన విశ్వాసము, పాపము విషయమై మారుమనస్సు, యేసును ప్రభువుగాను క్రీస్తుగాను ఒప్పుకొనడంవలన నీవు ఈ వేరుచేయబడిన దశను దాటావా?

## రెండవ దశ: రక్షణ

దేవుని పునఃనిర్మాణ విధానంలో రెండవ దశను రక్షణ దశ అని మనం పిలుస్తాం. ఈ దశలో నిజంగా మనం క్రీస్తుయొక్క ఆత్మసంబంధమైన శరీరంలోనికి తేబడతాం. ప్రత్యేకంగా ఈ దశ బాప్తిస్మం చుట్టు తిరుగుతోంది.

రోమా 6:3, 4లో పౌలు యిలా వ్రాశాడు:

> క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా? కాబట్టి తండ్రి మహిమవలన క్రీస్తు మృతులలో నుండి యేలాగు లేపబడెనో, ఆలాగే మనమును నూతనజీవము పొందినవారమై నడుచుకొనునట్లు, మనము బాప్తిస్మమువలన మరణములో పాలు పొందుటకై ఆయనతో కూడా పాతిపెట్టబడితిమి.

క్రొత్త నిబంధనలో బాప్తిస్మాన్ని గూర్చి యింత చిన్న స్థలంలో అంత ఎక్కువగా తెలియజేసే లేఖనము యొక్క రెండు వచనాలను మరెక్కడ కనుగొనగలం? ఈ రెండు వచనాలలో బాప్తిస్మమును గూర్చిన నాలుగు ప్రాముఖ్యమైన విషయాలు స్పష్టంగా ఉన్నాయి.

మొదటిది, బాప్తిస్మము క్రీస్తులోనికని పౌలు తెలియజేశాడు: "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ..." (3 వ.). బాప్తిస్మమందు, క్రీస్తు ప్రభువుయొక్క ఆత్మసంబంధమైన శరీరమైన సంఘములోనికి దేవుని కృపవలన తేబడ్డాం. క్రీస్తుకు మన విశ్వాసపు ప్రత్యుత్తరంలో చివరి భాగం బాప్తిస్మం (గలతీ. 3:26, 27; 2 తిమోతి 2:10).

రెండవది, మనము "ఆయన (క్రీస్తు యొక్క) మరణములోనికి బాప్తిస్మము" పొందామని పౌలు తెలిపాడు (3 వ.). క్రొత్త నిబంధన బాప్తిస్మమందు క్రీస్తు మరణము యొక్క ఉపకారములతో ఐక్యం కలిగియుంటానికి తేబడ్డాం. ఆయన మరణంలో ప్రభువు మనకు ఏది లభ్యమయ్యేలా చేసినా, దానిని మనం బాప్తిస్మమందు పొందుతాం.

మూడవది, బాప్తిస్మమందు మనం పాతిపెట్టబడ్డామని పౌలు స్థిరపరిచాడు. "గనుక బాప్తిస్మమందు ఆయనతో కూడా పాతిపెట్టబడి ..." (4 వ.). క్రొత్త నిబంధన బాప్తిస్మము పాతిపెట్టబడడం లేక ముంచబడడం *baptizo* అనే గ్రీకు పదం అనేకమైన తర్జుమాలలో – తర్జుమా చేయబడలేదు – అది కేవలం బాషాంతరం చేయబడింది. బాషా రూపపు మార్పిడిలో, గ్రీకు పదం తెలుగులో పలుకబడింది, లేక తెలుగు బాషాపదంగా మార్చబడింది. గ్రీకు పండితుల ప్రకారం, *baptizo* అనే దానికి సమానమైన తెలుగు పదం "ముంచడం" అనేది. పౌలు ఈ వచనంలో (మరియు కొలస్సీ. 2:12లోను) వినియోగించిన విధానంవలన *baptizo* యొక్క నిర్వచనం స్థిరపరచబడింది. క్రొత్త నిబంధన బాప్తిస్మము పాతి పెట్టబడడం లేక నీట ముంచడం అని మనం నిశ్చయత కలిగియుండవచ్చు.

నాల్గవది, పాపము విషయమై మనసొంత ఆత్మీయ మరణానికి మనం బాప్తిస్మం పొందినట్లు పౌలు వ్రాశాడు. "కాబట్టి తండ్రి మహిమవలన క్రీస్తు మృతులలోనుండి యేలాగు లేపబడెనో, ఆలాగే మనమును నూతన జీవము పొందినవారమై నడుచు కొనునట్టు, మనము బాప్తిస్మమువలన మరణములో పాలుపొందుటకై ఆయనతో కూడా పాతిపెట్టబడితిమి" అని అతడన్నాడు (4 వ.). పాపము విషయమైన మన మరణము బాప్తిస్మమందు తుది నిర్ణయం చేయబడింది. విశ్వాసము, మారుమనస్సు, యేసును ఒప్పుకొనడం, బాప్తిస్మం ద్వారా, "మనమికను పాపమునకు దాసులము కాకుండుటకు పాపశరీరము నిరర్థకమగునట్లు, మన ప్రాచీన స్వభావము ఆయనతోకూడా సిలువవేయ బడెనని యెరుగుదుము. చనిపోయిన వాడు పాపవిముక్తుడని తీర్పుపొంది

యున్నాడు" (రోమా 6:6, 7).

క్రీస్తు ప్రభువు జీవితంలోని మిక్కిలి ముఖ్యమైన సంఘటనలో ఒకటి, యోహానుచే ఆయన బాప్తిస్మము. భూనివాస కాలపు ఆయన పరిచర్యకు ఆయన బాప్తిస్మము, ఆయన శోధనలు ఉపోద్ఘాతంగా నిలిచాయి. ప్రభువైన యేసు యొర్దాను నదీ తీరాన కన్పించి, యోహానుచేత బాప్తిస్మం పొందడానికి ఆయన నీళ్లలోనికి దిగినప్పుడు, ఆయనకు బాప్తిస్మమియ్యడానికి యోహాను వెనుకంజవేసి, "నేను నీ చేత బాప్తిస్మము పొందవలసి యుండగా నీవు నా యొద్దకు వచ్చుచున్నావా?" అని ఆయనను అతడు నివారింపజూచాడు (మత్తయి 3:14). "ఇప్పటికి కానిమ్ము; నీతియావత్తు ఈలాగు నెరవేర్చుట మనకు తగియున్నది" అని ప్రభువు అతనితో అన్నాడు (మత్తయి 3:15). ప్రభువైన యేసు బాప్తిస్మపు నీటినుండి లేపబడిన తరువాత రెండు ముఖ్యమైన సంఘటనలు జరిగాయ్. పరలోకమందున్న ఆయన తండ్రి తొలిసారిగా బహిరంగమందు ఆయనను తన కుమారునిగా గుర్తించుతూ, యిలా అన్నాడు, "ఈయనే నా ప్రియకుమారుడు, ఈయన యందు నేనానందించుచున్నాను" (మత్తయి 3:17), మరియు పరిశుద్ధాత్మ పావురమువలె ఆయన మీదికి దిగివచ్చాడు (మత్తయి 3:16). ఎవనిపై పరిశుద్ధాత్మ దిగివచ్చి నిలుచుట తాను చూస్తాడో ఆయనే దేవుని కుమారుడని యోహాను తెలుపబడ్డాడు (యోహాను 1:33). గనుక, ప్రభువు బాప్తిస్మము పొందిన నాటనుండి, యోహాను ఆయన దేవత్వానికి సాక్ష్యమిచ్చాడు (యోహాను 1:29). ప్రభువైన యేసు యొక్క బాప్తిస్మం ఆయన పరిచర్యకు ఆరంభంగా నిలిచింది.

ప్రభువైన యేసు బాప్తిస్మం యొక్క ప్రాముఖ్యత మన బాప్తిస్మంయొక్క ప్రాముఖ్యతను జ్ఞాపకం చేస్తుంది. మన బాప్తిస్మం ఎంత ముఖ్యమయ్యిందో ఒకసారి యోచించి చూడు. పౌలు ప్రకారం, మనం బాప్తిస్మం పొందామంటే, ఆయన మరణములోనికి పాతిపెట్టబడ్డాం లేక ఆయన శరీరమైన సంఘంలోనికి తేబడ్డాం. ఆయన మరణములోనికిని ఆయన మరణం యొక్క ఉపకారములలోనికిని మనం తేబడ్డాం. పాపము విషయమై ఆత్మ సంబంధమైన మన మరణంలోనికి బాప్తిస్మం పొందాం. పాపపు ప్రాచీన పురుషుడు మననుండి వేరుచేయబడ్డాడు, మనం నూతన జీవము పొంది నడుచుకొనడానికి లేపబడ్డాం.

పునఃనిర్మాణం చేసే దేవుని విధానం యొక్క ఈ దశను నీవు దాటావా? నీవు క్రీస్తులోనికి ఆయన మరణములోనికి, ఆత్మసంబంధంగా, పాపము విషయంలో చనిపోడానికి బాప్తిస్మం పొందావా?

## మూడవ దశ: దానితోనే నిలిచియుండు

సుప్రసిద్ధమైన దేవుని పునఃనిర్మాణ కార్యక్రమంలో మూడవ దశ దానితో నిలిచి యుండు దశ అని పిలువవచ్చు. మనం తిరిగి నిర్మించబడినట్టయితే, తిరిగి నిర్మించబడిన స్థితిలోనే నిలిచియుండాలి. దేవుడు మనకు నూతన జీవం యివ్వగలడు, అయితే దాన్ని మనం జీవించాలి. ఆయన మనలను ఇరుకును సంకుచితమునైన మార్గమున నడిపిస్తాడు,

కాని దానియందు మనం నడవాలి.

6వ అధ్యాయం యొక్క మిగిలిన వచనాలలో క్రీస్తులో మనకున్న నూతన జీవము యొక్క కనీసం నాలుగు స్వభావ లక్షణాలను పౌలు తెలియజేశాడు. నూతన జీవముయొక్క ఈ లక్షణాలలో ప్రతిదానిని అనుదినం వర్తించుకోవాలి.

మొదట, క్రీస్తునందు మనకు స్వాతంత్ర్యం ఉంది అని పౌలు తెలిపాడు – మనం పాపంనుండి స్వతంత్రులమైయున్నాం. "చనిపోయినవాడు పాప విముక్తుడని తీర్పుపొంది యున్నాడు." (రోమా 6:7). స్వాతంత్ర్యమనేది సాధారణమైన పదం, దానికి నిజమైన అర్థం కావాలంటే దానికి ప్రత్యేకమైన సందర్భం యివ్వాలి. "నేను స్వతంత్రుడనై యుండాలి" అని ఒక వ్యక్తి అన్నప్పుడు, "దేనినుండి స్వతంత్రుడవై ఉండగోరుతున్నావు?" అని నేను అడుగనుద్దేశిస్తున్నాను. ఒకడు కేవలం స్వతంత్రుడైయుండడు. పనిచేయకుండా ఫ్రీగా ఉండాలని అతడు కోరుతున్నాడా? నియమావళినుండి స్వతంత్రుడా? నిద్రనుండి ఫ్రీ గానా? ఏదో ఒకదానినుండి ఒకడు స్వతంత్రుడైయుండాలి. రోమా 6లో సందర్భాన్నిబట్టి "విడిపింపబడి," "స్వాతంత్ర్యము" అనే భావాలను పౌలు యిచ్చాడు. క్రీస్తునందు మనము పాపమునుండి విడిపింపబడిన వారము – దాని దోషము నుండి స్వతంత్రులం (రోమా 3:24; 6:3); దాని పట్టులోనుండి స్వాతంత్ర్యం (రోమా 6:17); దాని సమాధినుండి విడుదల లేక శిక్షావిధినుండి విడుదల (రోమా 6:21).

రెండవది, నూతన జీవితము నూతన సహవాసముచేత తన స్వభావాన్ని తెలిపినట్టు పౌలు ప్రస్తావించాడు – మనకు దేవునితో సహవాసముంది. "అటువలె మీరును పాపము విషయమై మృతులుగాను, దేవుని విషయమై క్రీస్తుయేసునందు సజీవులుగాను మిమ్మును మీరే యెంచుకొనుడి" అని అతడు తెలిపాడు (రోమా 6:11). ఈ వచనంలో రెండు విభిన్నాలు గోచరిస్తున్నాయి, ఒకటి గుప్తం చేయబడింది, మరియొకటి వ్యక్తపరచబడింది. నీవు క్రైస్తవుడవు కాకమునుపు, దేవుని విషయములో మృతుడవుగాను పాపము విషయంలో సజీవుడవుగాను ఉన్నావని గుప్తం చేయబడింది. క్రైస్తవుడవుగా దేవుని విషయంలో సజీవుడవుగాను పాపము విషయములో మృతుడవుగా ఎంచుకొనుమని వ్యక్తపరచబడింది. క్రీస్తునందు, క్రొత్త సహవాసములోనికి, దేవునితో నూతన బాంధవ్యానికి వచ్చియున్నావు. నీవు ప్రార్థించడానికి నీకు పరలోకపు తండ్రి ఉన్నాడు, తన ద్వారా ప్రార్థించడానికి ప్రేమామయుడైన రక్షకుడున్నాడు. దేవుని యొక్క ఉనికి, సహవాసము, ఆశీర్వాదములు, వాగ్దానములు, ఆయన ప్రసాదించు ఆత్మసంబంధమైన జీవముతో నీవు దేవుని యెడల సజీవుడవుగా ఉన్నావు.

మూడవది, క్రీస్తునందలి నూతన జీవము. నూతన ఫలములు ఫలియించు స్వభావాన్ని తెలియజేస్తున్నట్టు పౌలు వివరించాడు.

> అప్పటి క్రియలవలన మీకేమి ఫలము కలిగెను? వాటిని గురించి మీరిప్పుడు సిగ్గుపడుచున్నారు కారా? వాటి అంతము మరణమే, అయినను ఇప్పుడు పాపమునుండి విమోచింపబడి దేవునికి దాసులైనందున పరిశుద్ధత కలుగుటయే మీకు ఫలము; దాని అంతము నిత్యజీవము (రోమా 6:21, 22).

క్రైస్తవేత్తరుడు ఒక రకమైన ఫలాన్ని తేవచ్చు, కాని అది స్థిరమయ్యింది కాదు, ప్రయోజనకర మయ్యింది కూడా కాదు. ఎందుకంటే "దానివలన కలిగే ఫలితం మరణం." ఈ జీవితపు అల్ప దినాలు గతించిపోయినప్పుడు నిలిచే ఫలాన్ని క్రైస్తవుడు తెస్తాడు. క్రైస్తవ శీలమనే ఆత్మసంబంధమైన ఫలాన్ని అతడు ఫలిస్తాడు మరియు నిరంతరముండే నిత్యజీవమనే ఫలాన్ని తెస్తాడు. "మనం దేవునికి ఏమి యిస్తామో దానినే మనం దాచుకుంటాం" అని ఒకడన్నాడు. మన జీవితాలను క్రీస్తు జీవంలో భీమా చేసి, పని చేస్తాం. ఆ భీమాలో నుండి నశించిపోని క్రైస్తవ శీలాన్ని మరియు నిత్యజీవాన్ని ఆయన తెస్తాడు.

నాల్గవది, క్రీస్తునందలి నూతన జీవము నూతన భవిష్యత్తువలన తెలియజేయ బడుతుంది: "ఏలయనగా పాపమువలన వచ్చు జీతము మరణము, అయితే దేవుని కృపావరము మన ప్రభువైన క్రీస్తుయేసునందు నిత్యజీవము" (రోమా 6:23). క్రైస్తవుడు పరలోకపు ప్రయాణంలో ఉన్నాడు. జీవగ్రంథమను బైబిలుయొక్క చివరి అధ్యాయాన్ని అతడు చదివాడు, ప్రభువు పక్షమే జయించుతుందని అతనికి తెలుసు. ఈ లోకమందు అతడు పోరాడవచ్చు, నలుగగొట్టబడవచ్చు కొన్ని సార్లు చీల్చబడవచ్చు, అయితే అంతిమ విజయం తనదేనని అతనికి తెలుసు!

యథార్థ హృదయముండి మంచి జీవితం జీవించగోరిన ఎవనికైనా క్రీస్తునందలి నూతన జీవం ఆకర్షణీయంగానే ఉంటుంది. మనం క్రైస్తవులమయ్యినప్పుడు ఆ నూతన జీవం మనదగుతోంది. పాపమునుండి విడుదల పొందిన జీవితం, ఆయనతో సహవాస మున్న జీవితం – ఫలభరితమైన జీవితం, పరలోకంలో నిత్య భవిష్యత్ ఉన్న జీవితం.

ఆ నూతన జీవం కాపాడబడి, నిలుపుకోవాలి. సొంతంగా, నడుపుకొంటూ అనుభవించడానికి నీకొక క్రొత్త కారు యివ్వబడిందనుకో. కొంతకాలం నీవు దాన్ని అనుభవించాలంటే, నీవు దాన్ని మెయిన్‌టెయిన్ చేయాలి. నీవు దాన్ని జాగ్రత్తగా నడుపకపోతే, ఇంజన్ని భద్రంగా ఉంచకపోతే, దాని టైర్లలో గాలి ఉంచకుండ, పెట్రోలు పోయకుండా ఉంటే, ఆ కారు ఎక్కువ కాలం నీదైయుండదు.

పాపంనుండి తనకు కలిగిన విడుదలను క్రైస్తవుడు కాపాడుకొంటూ ఉండాలి. అతడు తన మనస్సును శుద్ధిగా ఉంచుకొని, తన జీవితాన్ని చెడుగు పాలించకుండ భద్రపరచుకోవాలి. దేవునితో తన సహవాసాన్ని ప్రార్థన, బైబిలు పఠనం, ఇతర క్రైస్తవులతో సహవాసం, దేవునితో అనుదినం నడవడం అనేవాటిని అలవరచుకొంటూ ఉండాలి. ఎదుగుటకు ప్రయాసపడుతూ, ఫలములు ఫలియించుతూ ఉండాలి, ఇతరులను క్రీస్తులోనికి నడిపించుతూ, తనయందును యితరులయందును శీలమును పెంచే పనిలో ఉండాలి. తన నిరీక్షణ హృదయంలో ప్రకాశమానంగా మండునట్టు నిలుపుకొంటూ, తన నిత్యజీవపు నిరీక్షణను అతడు స్థిరపరచుకోవాలి.

## ముగింపు

నేడు నీవు క్రీస్తునందు నూతనమైన వ్యక్తిగా ఉండవచ్చు. నిన్ను రూపించి క్రీస్తునందున్న నూతన జీవాన్ని నీకు ప్రసాదింపగోరి, తన పునఃనిర్మాణ కార్యక్రమానికి

లోబరచుకోమని దేవుడు తన వాక్యం ద్వారా నిన్ను అడుగుతున్నాడు. ఆయన విధానం వేరుచేయబడడం, రక్షణ, దానియందు నిలిచియుండడంతో కూడియుంది. ప్రతి దశయు ప్రాముఖ్యమైనది మరియు అవసరమైనదియునై ఉంది.

క్రీస్తునందు ఈ నూతన జీవము కలిగియుండడానికి ఏమి కావాలో ఆలోచించు! కొన్ని దినాలుగా యింటనుండి దూరముగా ఉన్న తరువాత, యింటికి తిరిగి వచ్చేసరికి, నీ యింటనున్న ప్రతీది అసలైన క్రొత్తదిగా ఉందంటే, నీవు వెళ్లిన తదుపరి ప్రతిదాన్ని క్రొత్తదిగా చేసిందేదో నీ యింట ప్రవేశించియుండాలి. అప్పుడు నీవేమి చేస్తావ్? ప్రతిదాన్ని నీవు పరిశీలించడానికి మొదలుపెట్టవచ్చు. క్రొత్త కుర్చీలు, క్రొత్త మేజాలు, క్రొత్త పరుపులు, క్రొత్త టవళ్లు, క్రొత్త దుస్తులు, క్రొత్త చెప్పులు, క్రొత్త యింటి సామాగ్రి, క్రొత్త కార్పెట్లు, రగ్గులు, యింకా చాలా చాలా క్రొత్త వస్తువులు. నీ క్రొత్త సొత్తు విషయంలో నీవు ఉల్లసించవా? సంతోషంలోను, ఉత్సాహంలోను నీవు తప్పక మునిగిపోతావు!

ఈలాటి అనుభవం నాకు గాని నీకు గాని ఎన్నడు కలుగకపోవచ్చు. ఈలాటి అవకాశం బహు తక్కువ. మనం తిరిగి వచ్చేటప్పటికి ఎవరో మన ఇల్లునంతా సరికొత్త సామానుతోనూ బట్టలతోనూ కొత్తగా మార్చి ఉంచడం సాధ్యం కాదు. అయితే మరొక అవకాశం ఉండవచ్చు, అది అన్నీ క్రొత్త సొత్తుమీద కలిగియుండే దానికంటెను శ్రేష్ఠమైనది: నీవు క్రొత్త వ్యక్తియైయుండవచ్చు. నేడు దేవుని పునఃనిర్మాణ విధానంలో నీవు తిరిగి చేయబడవచ్చు.

దేవుని నూతన జీవము పొందిన జనులతో సంఘం రూపింపబడింది. వారు నూతన జీవపు కుటుంబము. అదే సమయంలో దేవుడు నిన్ను నూతన వ్యక్తిగా చేస్తాడు. ఆయన నిన్ను తన సంఘములో నిలుపుతాడు. నేడు దేవుని పునఃనిర్మాణ విధానానికి లోబడడం ద్వారా నూతన జీవం కలిగిన నూతన సమూహంలో ఎందుకు ప్రవేశింప కూడదు?

## స్టడీ మరియు చర్చకొరకైన ప్రశ్నలు

1. గ్రీకు పదములైన *neos*కును *Kainos*కును ఉన్న వ్యత్యాసమేమి? ఈ వ్యత్యాసాన్ని 2 కొరింథీ. 5:17కు వర్తింపజేయుము.
2. మనం క్రైస్తవులం కాకముందు మనం ఏ విషయంలో చచ్చినవారము?
3. రోమా 1–8వరకు క్లుప్తమైన సంక్షేప వర్ణన (ఔట్‌లైన్) యిమ్ము.
4. "కృప విస్తరింపవలెనని పాపమందు నిలిచియుందమా?" అనే పౌలు యొక్క ప్రశ్నకు భావము తెలుపుము (రోమా 6:1).
5. ఎప్పుడు లేక ఏ పాయింట్ వద్ద పాపము విషయమైన మన మరణం తుది నిర్ణయం అయ్యింది?
6. మార్పునొందే విధానంలో పాపంనుండి వేరుచేయబడే విధానమేమి?
7. వేరుచేయబడే దశ వదలిపెట్టబడినట్టయితే, ఒకని మార్పుని గూర్చిన సత్యమేది?
8. మనం క్రీస్తులోనికి ఎలా తేబడ్డాం?
9. *Baptizo* అనే గ్రీకు మాటకు అర్థమేమి?

10. రోమా 6:4లో మరణములోనికి బాప్తిస్మముపొందితిమని పౌలు చెప్పినప్పుడు అతని భావమేమి?
11. రోమా 6:1–4లో పౌలు బాప్తిస్మమును గూర్చి ప్రస్తావించిన, నాలుగు సహజ లక్షణములను తెలుపుము.
12. రోమా 6:7 ప్రకారం క్రీస్తునందు మనకెట్టి స్వాతంత్ర్య మివ్వబడింది?
13. "దేవునియందు సజీవులమని" పౌలు సూచించినప్పుడు అతని భావమేమి?
14. క్రైస్తవుడు ఫలించే ఫలం ఎలాటిది?
15. క్రైస్తవునికెట్టి భవిష్యత్తుంది? దాన్ని వర్ణించు.